

చీకట్లో చెట్టుక్రింద భార్యా బిడ్డలతో నిద్రపోతున్న సైదులు— మొహం మీద రెండు నీటిచుక్కలు పడటంతో కళ్ళు తెరిచాడు.

చీకటి గుయ్యారంగా వుంది. చెట్టు ఆకులమీద పడే వానచినుకుల మోత టపటపా వినబడుతోంది.

సైదులు లేచి కూర్చున్నాడు.

అప్పుడప్పుడూ తళుక్కన మెరిసే మెరుపుకాంతిలో పారుతున్న వాననీరు కనబడింది. చాలా సేపట్నించీ కురుస్తోందన్న మాట. దట్టంగా ఆకులతో వున్న కుంకుడుచెట్టు క్రింద పడుకోటం వల్ల ఇంతదాకా తనమీద ఒక్క నీటి చుక్క పడలేదు.

మెరుపు కాంతిలో భార్యాపిల్లల్ని చూసాడు సైదులు. వాళ్ళు అదమరచి నిద్రోతున్నారు.

తల గోక్కుని లేచి గోనెగుడ్డ తీసాడు.

చెట్టు ఆ కొమ్మనించి ఈ కొమ్మకి కట్టి భార్యాబిడ్డలమీద వాన చినుకులు పడకుండా జాగ్రత్తపడ్డాడు. బొడ్లోంచి

బీడీముక్క తీసి వెలిగించుకుని వాళ్ళ పక్కనే ముడుచుకు కూర్చున్నాడు.

"ఎదవ్వాన!" తిట్టుకున్నాడు. అలా అన్నాడో లేదో వానజల్లు ఎక్కువైనట్టు శబ్దం ఎక్కువైంది.

—తెల్లారేసరికి వూళ్ళో బావులన్నీ నిండిపోతాయి. బొక్కెనా తాడూ లేకుండానే అందరూ నీళ్ళందుకుంటారు. ఇంకా తనని పిల్చేవాళ్ళెవరూ? పూడికలు తీయించుకునేవాళ్ళెవరూ? చిరాగ్గా ఘుపుక్కున వూసి బీడీదమ్ము గట్టిగా లాగేడు సైదులు.

—"బాయిల్లో పూడికలు తీస్తాన్! సావాన్లు తీస్తాన్!" అని తను అరవక ముందే "నేనున్నానోరే!" అని లేస్తుంది ఈ ఎదవ్వాన!

బావుల్లో పూడికలు తీస్తూ, పడిన సామాన్లు తీస్తూ వూరూరా కుటుంబంతో సహా తిరుగుతూ పొట్టపోసుకుంటాడు సైదులు. తాడిలోతు నీళ్ళున్న నూతుల్లో కూడా ఇట్టేదిగి అట్టడుగునున్న బిందెల్ని బొక్కెన్లని నిముషాల్లో తీసెయ్యగల ఘనత సైదులదే. అతనంటె చుట్టూ వున్న పదూళ్ళకీ తెలుసు. వూరు కొాక మూడ్రోజులు చొప్పున పదూళ్ళూ నెలలో చుట్టివస్తాడు. బావుల్లో పూడికలు, సామాన్లే కాక మంచాలు నేస్తాడు. పందిళ్ళు ఒక్కడే వేస్తాడు. ఇళ్ళు కడతాడు. పెంకుటిళ్ళు నేస్తాడు.

తన వృత్తిలో తనకెవ్వరూ పోటీ లేరు సైదులుకి— కానీ ఈ 'మాయదారి వానే' అప్పుడప్పుడూ పోటీపడి వస్తుంది.

—నిన్న సాయంత్రం ఇక్కడికొచ్చాడు సైదులు. ఇంతకు ముందు ఈ వూరొచ్చి నెల రోజులు దాటింది. బావులన్నీ బాగా పూడిపోయాయని ఆ నోటా ఈనోటా విన్నాడు. తన కోసం వూరివాళ్ళందరూ ఎదురుచూస్తున్నట్టు కూడా తెలుసుకున్నాడు.

కానీ ఇప్పుడీ వాన—....

వానకి గాలి తోడైంది.

మెరుపుల వెంట వురుములు పేట్రేగేయి.

కుండపోత వాన లంకించుకుంది.

సైదులు మీద వానబొట్లు ఏకధాటిగా పడనారంభించేయి.

బొట్లు ధారలుగా మారేయి.

భార్యాపిల్లలూ కూడా లేచేరు తడుస్తూ.

"చెట్టు మొదట్లో కెల్లండే!" అని చింకి పక్కబట్టల్ని గబగబా చుట్టేడు సైదులు. ఒక పక్కకి ఒరిగిన చిన్న పర్వతంలాంటి కుంకుడుచెట్టుమొదలు వాళ్ళు తలలు దాచుకునేందుకు స్థానమిచ్చింది.

వానదేవుడి బారినుంచి తప్పించుకుంటే, 'గాలి' దేవుడు వూర్కోలేదు. చల్లగా ఛెళ్ ఛెళ్న వచ్చి వాళ్ళను కుమ్మటం ప్రారంభించేడు.

సైదులు, వంటిమీద ఒక్క పంచె

పాచ తప్ప మరేం లేకపోయినా తట్టు కుంటున్నాడు. అతని భార్య కూడా బాగా ముడుచుకు కూర్చుంది. పిల్ల, పిల్లాడు మాత్రం గజగజలాడుతున్నారు. పళ్ళు టకటకా కొట్టుకుంటున్నారు.

"ఆ గోనెగుడ్డిప్పి ఇటడెయ్యరో!" భార్య ఆ మాట అనకముందే చెట్టు కొమ్మలకి కట్టిన గోనెగుడ్డిప్పి వాళ్ళ ముగ్గురికీ కప్పేడు సైదులు.

తిట్టుకుంటూ తనూ చెట్టుమొదట్లో ఒక పక్కగా కూర్చున్నాడు.

వాన కురుస్తూనే వుంది.

గాలి వీస్తూనే వుంది.

మెరుపులు, వురుములు, పిడుగులు హంగామా చేస్తూనేవున్నాయి.

"సీ! సీ! మాయదారి దేవుడు. నా నోట మట్టికొడతన్నాడు!" అని తిట్టు కుంటూనే ఎప్పటికో నిద్రలోకి జారు కున్నాడు సైదులు.

సూర్యుడి చురుకైన చూపులకి తట్టు కోలేక లేచేడు. అప్పటికే భార్యా పిల్లలు లేచారు. పిల్లలు 'ఆకలి' వెంటబడి ఏడుస్తున్నారు. భార్య "వుండండశా! పొద్దునవలేదింకా సస్తన్నారు ఆకలో అని. మీ అయ్య నడగండి" అని వాళ్ళ ద్దర్నీ కసురుకుంటోంది.

సైదులు అవన్నీ చూస్తూ చూడనట్టే వూరుకున్నాడు. గబగబా లేచి చకచకా దూరాన కనబడే చెరువు వైపు నడిచేడు.

కాలకృత్యాలవ్వగానే వచ్చి మోకు, చిన్న కర్ర, చూరుకుట్టు బద్ద తీసుకుని వూరిలోకి నడక సాగించేడు సైదులు.

పిల్లల ఆకలి కేకలు అతని చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి.

* * *

నడినెత్తికి సమీపించేడు సూర్యుడు.

—అప్పటికి వూరి వీధులన్నీ ఒక సారి చుట్టేశాడు సైదులు.

ఎవ్వరూ పిలవలేదు.

పలకరించినవాళ్ళు తేలిగ్గా నవ్వేసి "నిన్నటిదాకా లేని వాన రాత్రొచ్చేసిం దిరా సైదులూ! ఏంటో ఈ అకాల వర్షాలూ, వ్యవహారం. కలియుగం! ఋతుచక్రం కూడా అస్తవ్యస్తంగా తయారైంది" అన్నారు.

"అస్తవ్యస్తమైంది ఋతు చక్రం కాదు. నా బతుకు చక్రం" అనుకున్నాడు సైదులు.

మళ్ళీ రెండో ఇడత వీధులెమ్మటి బైల్దేరేడు.

"బాయిల్లో సావాన్లు తీస్తాన్! పూడి కలు తీస్తాన్! ఇళ్ళు కుడతాన్! మంచాలు నేస్తాన్!...." గొంతెండు తున్నా కేకలు పెడుతున్నాడు సైదులు.

ఇళ్ళ తలుపులన్నీ వేసివున్నాయి.

"అందరూ ఆయిగా అన్నం తింటు న్నారు" అనుకున్నాడు సైదులు.

రాత్రి రొచ్చయిన వీధులన్నీరాళ్ళలా బిగుసుకుంటున్నాయి సూర్యుణ్ణి చూసి.

"ఈ వూరి బాయిలన్నీ ఒక్కమా

లెండిపోతే ఎంత బావుంటుందీ!" తన ఆలోచనకి తనే నవ్వుకున్నాడు సైదులు.

"బాయిల్లో సావాఁన్లు...." మళ్ళీ అరిచేడు.

ఇప్పుడతని పిల్లల ఆకలి కేకలు అతన్ని వెంటాడడం లేదు. తన కడుపు నకనకలే చెండాడుతున్నాయి.

నిస్సత్తువతో నడుస్తున్న సైదులు హఠాత్తుగా ఆగిపోయాడు. ఎక్కణ్ణించో వినవస్తున్న కేకలు, కోలాహలం అతణ్ణి ఆపేసాయి.

ఇంతలో ఎవరో పరుగెత్తుకొచ్చి చెప్పేరు—

"ఏయ్ సైదులూ! నాయుడిగారి నూతిలో ఎవరో పిల్ల పడిపోయింది అందరూ నీ కోసం ఎదుకుతున్నారు రా!"

వచ్చినంత వేగాన సైదుల్ని లాక్కెళ్ళాడు వచ్చిన మనిషి.

సైదులు ముఖం విప్పారింది.

కొత్త వుత్తేజం వచ్చింది.

'బాయిలో పిల్లడిపోయింది' మనసులోనే సంతోషంగా అనుకున్నాడు. ఇదే సమయం. ఇప్పుడే సంపాయించుకోవాలి పదిరోజుల తిండి డబ్బు. ఆ 'పేనాన్ని' రక్షించే ముందు తన 'పేనాని'కి కావాల్సిన పైసలు మాట్లాడుకోవాలి. ఇప్పుడా పిల్ల చావుబతుకులు తన చేతుల్లో వున్నాయి. తనెంతడిగితే అంతిస్తారు వాళ్ళు. పిల్ల 'పేనం' కోసం.... కన్న బిడ్డ 'పేనం' కోసం డబ్బివ్వటానికి వెనకాడేవాళ్ళెవరుంటారూ?

తనెంత అడిగి, బెట్టుగా గట్టిగా బేరం కుదుర్చుకోవాలోనని చకచకా....గబగబా.... ధనధనా వూహించేసుకుంటున్నాడు సైదులు.

బావి దగ్గిర పడింది.

నడకలో వేగం తగ్గించాడు. అంటే వాళ్ల ముందు కాళ్లకి బంధమన్నమాట.

నూతి చుట్టూ జనం. "అయ్యో! అయ్యో! పిల్ల బుడగలేస్తోంది. తొందరగా రారా సైదులూ!" అంటూ వచ్చి సైదులు చేతులు పట్టుకున్నారు.

వాళ్ల గాభరా అరుపులు తనకు 'లక్ష్మీ'దేవి పిలుపుల్లా—తనలో ఏనుగంత బలంలా వూహించుకుంటున్నాడు సైదులు. వాళ్ల బతిమాలింపులకీ, అభ్యర్థనలకీ, అర్థింపులకీ చాలాసేపు మాట్లాడలేదు. అడుగు ముందుకి వెయ్యలేదు.

ఇక లాభంలేదని "ఆగండి! డబ్బెంతిత్తారు సెప్పండి ముందు!" నిశ్చలంగా అడిగేడు సైదులు.

అందరూ అవాక్కయిపోయారు క్షణం.

నూతిచుట్టూవున్న ఆడవాళ్లు లబోదిబో నోళ్ళు కొట్టుకుంటూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు. అశక్తతతో అరుస్తున్నారు.

"నీయవ్వ కడుపు బంగారంగానూ! ముందు పిల్లని తియ్యరా! ఇంకో క్షణం

ఆలస్యం చేస్తే పిల్ల ప్రాణంపోతుంది!" ఒకాయన నోరు పెగల్చుకున్నాడు.

"ముందు పిల్లని తియ్యరా! నీ డబ్బుకే వొచ్చే!" ఇంకో పెద్దమనిషి సైదులు భుజాల్ని కుదిపేడు.

సైదులు గుండె కరగలేదు. నిశ్చయంలో మార్పులేదు–

"అలాగేం కుదర్దు. ముందేసెప్పండి. నాకు గిట్టుబాటైతేనే దిగుతా. ఆఁ!" అందర్నీ తోసుకుంటూ వెళ్లి పక్కన రాతిమీద కూర్చున్నాడు సైదులు.

అందరూ ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

"ఇదుగో! పది రూపాయలు. కానీ!" ఒకాయన పది రూపాయలు తీసాడు జేబులోంచి.

"కుదర్దు. ఇరవై ...." తల తిప్పుకుని ఎటో చూస్తూ చెప్పేడు సైదులు.

"సరే! ఈ పదికూడా కలిపి ఇద్దాం. రామ్మూర్తిగారూ!" అన్నారింకొకరు ఇంకో పది జోడిస్తూ.

అంతే!

కత్తిలా తలతిప్పి, బాకులా చెయ్యి చాచి ఆ ఇరవై అందుకుని, క్షణాల్లో నూతులోకి దూకేసాడు సైదులు.

నూతిచుట్టూ ప్రజల్లో ఆందోళన! హాహాకారాలు!

"పాపం! ఎవరిపిల్లో! భగవంతుడి దయవల్ల బతికితే బావుణ్ణు."

"ఎలా పడిందండీ అసలూ?"

"ఏమో పాపం! నేలబావు నుయ్యి. అందులో వాకిట్లోనే వుంది. ఏ ముష్టిపిల్లో పాపం!"

"నాయుడుగారికి అందరూ చెప్పారు–'పైకి వరలు కట్టించండి బాబూ!' అని. ఏకీ! ఆయన వింటేనా!"

జనం నానా రభసాపడుతున్నారు.

బావిలో మునిగిన సైదులు మరుక్షణం పిల్లని వెదకి పట్టుకోగల్గేడు. క్షణాల్లో పైకి వచ్చేసాడు.

అతని భుజంమీది పిల్ల శవాకారంలా వుంది. అయినా అందరి ముఖాలూ విచ్చుకున్నాయి.

పిల్లని పక్క అరుగుమీద పడుకోబెట్టి, తలనీళ్లు చేతుల్తో పిండుకుంటూ చూసాడు సైదులు–

అంతే!

సైదులు నవనాడులూ స్తంభించేయి.

కళ్లు బైర్లుకమ్మేయి.

–ఎదురుగా తన కూతురు!!

"లచ్చిమీఁ" గొంతు పగిలేలా అరుస్తూ కూతురిమీద వాలిపోయాడు సైదులు.

క్షణాల్లో అతని నోరు ఎండి తడారిపోయింది–తను కోరుకునే బావుల్లా.